కథ

"అయ్యా! మరేం చేయమంటరు?"
చేతులు కట్టుకొని వినయంగా అడిగాడు అయిలయ్య.
ఆఫీసు బంట్రోతు- "సీనియర్ అసిస్టెంట్‌ను రమ్మను"-
హూంకరించాడు ఆఫీసర్- అసలే అసహనం జాస్తి... అందులో
ఆఫీసర్లకు కోపానికి దోస్తి...! అయిలయ్య సర్వీసు ఆఫీసర్ సర్వీసుకు
రెట్టింపు- హూంకరింపులు విని విని అయిలయ్య చెవులు మామూలు
శబ్దాలు వినడం మానేశాయి. ఎవరైనా గట్టిగా మాట్లాడితే తప్ప బదులు
పలకడు...! అగ్గి మీద గుగ్గిలం ఈనాటి ఆఫీసర్లకేం తెలుసు.
పెనం మీది అట్టులా కుత కుత ఉడికిపోతున్నాడు
ఆఫీసర్ ! పై నుంచి ఆర్డర్ అలాంటిది !!

# రేపటి వార్త

## డా. సదానంద్ శారద

"అయిలయ్యా..."

"అయ్యా..."

"సీనియర్ అసిస్టెంట్..."

"లీవు మీద ఉన్నడయ్యా..."

"జూనియర్ అసిస్టెంట్..."

"లీవు మీద లేడయ్యా..."

"పిలు..."

"సీట్లో లేడయ్యా..."

"ఎక్కడ చచ్చాడు?..."

"బతికే ఉన్నాడయ్యా- క్యాంటిన్‌లో టీ తాగుతున్నాడయ్యా..."

"రమ్మను..."

"టిఫిన్ తిన్న తరువాత రమ్మననా...తినక ముందు రమ్మననా..."

"ఇంత పొద్దున్నే టిఫిన్ ఏవిటయ్యా నాన్సెన్స్..." కోపంగా చూశాడు ఆఫీసర్.

"ఇది పొద్దున కాదయ్యా... పగలయిందయ్యా..."

"అరరే... చాలా టైమయింది...!!"

"అవునయ్య... మీకు భోజనం తేనా అయ్యా..."

"ఏం భోజనంలే... పై నుంచి ఫర్మానాలతో కడుపు నిండిపోతున్నది. ముందు పని కావాలి. జూనియర్ అసిస్టెంట్‌ను పిలూ..."

"టిఫిన్ అయిపోయి ఉంటది. కాఫీ తాగినంక రమ్మననా... తాగక ముందు రమ్మననా?..."

"వక్క పొడి కూడా వేసుకొని రమ్మను..."

"అలాగేనయ్యా..."

"అయిలయ్యా నిన్ను డిస్మిస్ చేస్తే ఏం చేస్తావ్...?"

"మన ఆఫీసు ముందు మిరప బజ్జీల బండి పెట్టుకుంటనయ్యా..."

"వెంటనే ఆ పని చేయి..."

"మరి జూనియర్ సాబ్‌ను ఎవలు పిలుస్తరు...?"

"కాఫీ కూడా అయిపోయె ఉంటుంది. రమ్మను-"

"అలాగేనయ్యా..."

***

"గుడ్ మార్నింగ్ సర్... సారీ... గుడాఫ్టర్ నూన్ సర్..."

"ఊఁ..."

చేతులు కట్టుకోలేదు కాని అంత వినయంగా నించున్నాడు జూనియర్ అసిస్టెంట్ రాజేందర్.

"చూడు మిస్టర్ రాజేందర్..." అన్నాడు ఆఫీసర్.

"ఎస్...సర్..."

"మన రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు కలెక్షన్లేం బాగా లేవు..."

"ఎస్...సర్..."

"మంత్రిగారు మండిపడుతున్నారు"

"ఎస్...సర్..."

"మనం ఏదో చేయాలి..."

"ఎస్...సర్..."

"వెధవ ఉద్యోగం... వెధవ ఉద్యోగం..."

'ఎస్... సర్...' అన్లేదు జూనియర్ అసిస్టెంట్...!

ఎందుకు సర్ అన్నట్లు మొహం పెట్టాడు.

"మన రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఆదాయం ప్రభుత్వం నిర్ణయించిన టార్గెట్‌కు సగం కూడా లేదు... మంత్రిగారి సలహాదారు మండిపడమన్నారట... మంత్రిగారు భగ భగ మండిపడుతున్నారు-" కణతలు నొక్కుకున్నాడు ఆఫీసర్.

"అయ్యా నేనొకటి తెల్వక అడుగుతా..." ఆఫీసర్ వంక చూస్తూ అన్నాడు అయిలయ్య.

ఏవిటన్నట్లు చూశాడు ఆఫీసర్.

"అయ్యా మనమేమన్న సరుకులు అమ్ముతున్నమా... టార్గెట్లు పెట్టేదానికి... జనం ఇష్టం... ఎన్ని జాగలు, భూములు, ఇండ్లు

రిజిస్టరయితే అంత పన్ను వసూలు అయితది- ముందే దీనికి టార్గెట్ ఎట్ల పెడ్తరు?''

''ఆ సంగతి మీకు నాకు తెలుసునయ్యా... మంత్రిగారి సలహాదారు వినిపించు కుంటలేడు కదా...?

''ఆయినెవలు మద్దెన...''

''అసలు గొడవలన్నీ ఆయనతోనే... ఈ టార్గెట్ సలహా ఆయన చలవే...''

''ఎస్... సర్...'' అన్నాడు రాజేందర్-

''నీకు ముందే తెలుసా?...'' ఆఫీసర్ గుర్రుగా చూశాడు జూనియర్ అసిస్టెంట్ రాజేందర్ వంక.

అలవాటుగా ఎస్...సర్... అన్నందుకు నాలిక్కరచుకున్నాడు జూనియర్ అసిస్టెంట్.

''మనదేం పోయింది- పై నుంచి ఆర్డర్... రిజిస్ట్రేషన్ చార్జీలు వచ్చే ఫస్ట్ నుంచి రెట్టింపు చేయండి- అట్లా టార్గెట్ చేరాలట...''

''ఎస్...సర్...'' అనొచ్చునో లేదో అని క్షణం ఆలోచించి ''ఎస్... సర్...'' అనేశాడు జూనియర్ అసిస్టెంట్ రాజేందర్.

నెలరోజులు గడిచాయి-

ఒక రోజు ఆఫీసర్... అసిస్టెంట్‌ను పిలిపించి అడిగాడు-

''టార్గెట్ చేరుకున్నామా?...''

''లేదు సర్...'' అన్నాడు అసిస్టెంట్ విచారంగా-

''ఏమయింది జనానికి...''

''పెరిగిన రిజిస్ట్రేషన్ చార్జీలు భరించలేక రిజిస్ట్రేషన్లకు జనం రాక తగ్గిపోయింది సర్...''

''అట్లా తగ్గితే టార్గెట్ ఎట్లానయ్యా... టార్గెట్?''

''మమ్మల్ని ఏం చేయమంటారు సార్?''

''ఇంతకు ముందే పై నుంచి ఆర్డర్ వచ్చేసింది...''

''ఏమని సర్?...''

''రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచినా టార్గెట్ చేరుకోకపోతే... స్థలాల రేట్లు పెంచేయమని ఆర్డర్... అట్లా టార్గెట్‌ను చేరాలట... వచ్చే ఫస్ట్ నుంచే అమలు...''

''అట్లాగే సర్... ఆర్డర్ ప్రకారం స్థలాల రేట్లు పెంచేద్దాం.... ఆవిధంగా రిజిస్ట్రేషన్ పన్నులు ఇచ్చేయండి...''

''అట్లాగే సర్...''

''ఇంగ్లీషు... తెలుగు... హిందీ... ఉర్దూ- అన్ని పత్రికల్లో ఇచ్చేయండి...''

''అట్లాగే సర్...''

''ఇప్పుడైనా టార్గెట్ చేరుకోవాలె...''

''అట్లాగే సర్...''

మరో నెల రోజులు గడిచాయి-

''మంత్లీ టార్గెట్ చేరుకున్నామా?...''

ఆఫీసర్ అసిస్టెంట్‌ను పిలిచి ఆరా తీశాడు-

బిక్కమొహం వేశాడు అసిస్టెంట్.

''లేదు సర్... రిజిస్ట్రేషన్లు ఇంకా పడిపోయాయి-'' అన్నాడు-

''అరెరే... మరిప్పుడేం చేయాలి... మంత్రిగారి సలహాదారు టార్గెట్... టార్గెట్ అని ప్రాణం తింటున్నాడు-''

''ఎంత ఆదాయం వస్తే అంత ముట్ట చెబుతాంకాని- టార్గెట్ మన చేతుల ఉన్నదా సర్...''

అంతలో ఆఫీసర్ టేబుల్ మిది ఫోన్ మోగింది... ఆ తరువాత ఆఫీసర్‌గారి మొహం మారింది. కంఠం మారింది.

''పెరిగిన స్థలాల దరలు... పెరిగిన రిజిస్ట్రేషన్ ధరలు చూసి జనం స్థలాలు... ఇండ్లు కొనడం మానేస్తున్నారు సార్... టార్గెట్ రీచ్‌కావడం కష్టంగా ఉంది...''

దబాయించే అల్లుడిలా కాక అమ్మాయినిచ్చిన మామలా నీళ్ళు మింగుతూ మాట్లాడుతున్నాడు ఆఫీసర్.

ఆయన మొహంలో మారుతున్న రంగులను బట్టి అక్కడ నిల్చోకూడదని... కూర్చో కూడదని వెళ్ళి పోయాడు అసిస్టెంట్.

అయిదు నిమిషాల దాకా సాగింది ఫోన్‌లో మొట్టి కాయల పరంపర.

ఆ తరువాత అటెండర్ అయిలయ్యను పిలిచి గటగటా రెండు గ్లాసుల నీళ్ళు తాగాడు ఆఫీసర్.

అయిలయ్య ఇంకో గ్లాసు నింపుతుండగానే-

''సీనియర్‌ను పిలువు-'' అన్నాడు-

క్షణాల్లో



సీనియర్ అసిస్టెంట్ ప్రత్యక్షమయ్యాడు.

ఎందుకైనా మంచిదని జూనియర్ అసిస్టెంట్ కూడా ప్రత్యక్ష మయ్యాడు.

అప్పుడు ఆఫీసర్ గొంతు సవరించుకొని ఇట్లా చెప్పాడు.

''టార్గెట్ ముఖ్యమట... ఎట్లాగైనా టార్గెట్ చేరుకోవాలట...''

సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ ఇద్దరూ జాయింట్‌గా తలలూపారు.

''ఇండ్ల, స్థలాల అమ్మకాలు తగ్గాయి కనుక... సర్‌ప్లస్ ఇండ్లమీద... సర్‌ప్లస్ స్థలాల మీద అడ్వాన్స్ రిజిస్ట్రేషన్ చార్జీలు వేయమని ఆర్డర్...''

''.... ....''

''విన్నారా...''

''విన్నాం సార్...'' ముక్త కంఠంతో అరిచారు అసిస్టెంట్లు ఇద్దరు–

''సర్‌ప్లస్ స్థలాలు, ఇండ్ల వివరాలు సేకరించి అడ్వాన్స్ రిజిస్ట్రేషన్ చార్జీలు వసూలు చేయండి– టార్గెట్ ముఖ్యం. తెలిసిందా...''

''తెలిసింది'' అన్నాడు సీనియర్ అసిస్టెంట్

''తెలిసింది'' అన్నాడు జూనియర్ అసిస్టెంట్.

వెళ్ళబోతూ వెనక్కుతిరిగి ఇట్లా అడిగాడు సీనియర్ అసిస్టెంట్–

''ఈ విషయం మీడియాకు తెలుపమంటారా సార్... జనం వెంటనే స్పందించి... రిజిస్ట్రేషన్‌లు పెరుగుతాయేమో...''

''టార్గెట్ చేరుకుంటామేమో...'' అన్నాడు జూనియర్ అసిస్టెంట్...

''ఓ.కె... మీడియాకు ప్రకటనలు ఇచ్చేయండి–''

''ఎస్. సర్...''

''ఎస్సార్...''

రెండవ రోజు ఉదయం–

జనం తండోపతండాలుగా రిజిస్ట్రేషన్ కార్యాలయం ముందు గుమిగూడారు.

''అయిలయ్యా... ఏవిటా హడావుడి?...''

ఆఫీసర్ అటెండర్‌ను పిలిచి అడిగాడు.

''జనం సార్ జనం... '' అన్నాడు అయిలయ్య.

''రిజిస్ట్రేషన్ల కోసమే !!...'' ఆఫీసర్ మొహం వెలిగిపోయింది.

''జనం చేతులల్ల ఏమున్నయో తెలుసా సార్...''

''ఏముంటాయి... రిజిస్ట్రేషన్ కోసం స్టాంప్ పేపర్లు...''

''కాదు...రాళ్ళు సార్...''

''ఆc !!!...''

*

